తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజు
జాతీయ దిన పత్రిక
RNI . TELTEL / 2022 / 83463

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శుక్రవారం
24 అక్టోబర్ 2025
సంపుటి 66
సంచిక 3
పేజీలు 9
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్ కు టికెట్ ఇచ్చింది - కేసీఆర్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు
- హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు ఈ ఎన్నిక ఒక పరీక్ష అని వ్యాఖ్య
- ఈ ఫలితం జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని జోస్యం

☞ 2

# స్థానిక ఎన్నికలపై నిర్ణయం హైకోర్టు తీర్పు తర్వాతే...

- ❖ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని మంత్రి పొంగులేటి స్పష్టీకరణ
- ❖ వచ్చే నెల 7న మరోసారి కేబినెట్ భేటీ



తరంగాలు న్యూస్, డెస్క్, అక్టోబర్ 23 : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నొక్కిచెప్పారు. ఈ అంశంపై నవంబర్ 3న హైకోర్టులో విచారణ జరగనుందని తెలిపారు. "ఉన్నత న్యాయస్థానం నుంచి తీర్పు రాగానే, కేబినెట్‌లో చర్చించి స్థానిక ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకుంటాం. ఈ క్రమంలో నవంబర్ 7న మరోసారి కేబినెట్ సమావేశం అవుతుంది" అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఈ సమావేశంలో కేవలం ఎన్నికల అంశమే కాకుండా పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో పాటు, 1500 మెగావాట్ల ...

☞ 2

## మంత్రితో వివాదం... ఉద్యోగానికి ఐఏఎస్ అధికారి రాజీనామా..



- ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ
- మంత్రి జూపల్లి కృష్ణారావుతో లిక్కర్ హెూలోగ్రామ్ టెండర్లపై తీవ్ర విభేదాలు
- రిజ్వీ వీఆర్ఎస్‌ను తిరస్కరించాలంటూ సీఎస్‌కు మంత్రి జూపల్లి లేఖ
- మంత్రి అభ్యంతరాలను పట్టించుకోకుండా వీఆర్ఎస్‌ను ఆమోదించిన ప్రభుత్వం

తరంగాలు న్యూస్ / డెస్క్, అక్టోబర్ 23 : తెలంగాణ ప్రభుత్వంలో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారికి, మంత్రికి మధ్య జరిగిన తీవ్ర వివాదం ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు (వీఆర్ఎస్) దారితీసింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో తలెత్తిన విభేదాల కారణంగా వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ బుధవారం తన పదవికి ....

2



## హైదరాబాద్‌లో సెక్స్ రాకెట్ గుట్టురట్టు

### - విదేశీ యువతికి విముక్తి

- బంజారాహిల్స్ హెూటల్‌లో వ్యభిచారం
- ప్రధాన నిర్వాహకుడితో పాటు ఏడుగురు విటులు, రిసెప్షనిస్ట్ అరెస్ట్
- యువతులకు ఉద్యోగాల ఆశ చూపి వ్యభిచారం
- నిందితుల నుంచి నగదు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం

తరంగాలు న్యూస్ / డెస్క్, అక్టోబర్ 23 : హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గుట్టుగా సాగుతున్న ఓ భారీ వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. నగరంలోని ఓ ప్రముఖ హెూటల్‌ను కేంద్రంగా చేసుకుని సాగుతున్న ఈ దందాపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిర్వాహకులతో పాటు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా చెర నుంచి ఉజ్బెకిస్థాన్ యువతితో సహా ముగ్గురు మహిళలను రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఆర్-ఇన్ హెూటల్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి హెూటల్‌లోని 111, 112 నంబర్ గదులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ప్రధాన నిర్వాహకుడైన ఎండీ షరీఫ్‌ను ...

మిగతా 2 లో..

## తెలంగాణ సర్కార్ మరో ముందడుగు..

### - పట్టణాలకు విస్తరించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం

- ఇకపై పట్టణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- 400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలానికీ వర్తింపు
- జీ+1 పద్ధతిలో ఇల్లు కట్టుకునేందుకు గ్రీన్ సిగ్నల్
- లబ్ధిదారులకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- మురికివాడల రూపురేఖలు మార్చడమే లక్ష్యమన్న మంత్రి



తరంగాలు న్యూస్ / డెస్క్ (అక్టోబర్ 23) తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రతిష్ఠాత్మక 'ఇందిరమ్మ ఇళ్ల' పథకాన్ని ఇకపై పట్టణాలకు కూడా వర్తింపజేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా, తక్కువ స్థలం ఉన్నవారు సైతం సొంతింటి కలను నెరవేర్చుకునేలా జీ ప్లస్ 1 (గ్రౌండ్ ం ఫస్ట్ ఫ్లోర్) పద్ధతిలో ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు బుధవారం జీవో 69ను జారీ చేసింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన ఈ పథకం, తాజా నిర్ణయంతో పట్టణ వాసులకు సైతం అందుబాటులోకి రానుంది. బుధవారం సచివాలయం లో ఈ పథకంపై సమీక్ష నిర్వహించిన గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఈ వివరాలను వెల్లడించారు. పట్టణాల్లో స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ సడలింపులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. "400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్నా, కనీసం 30 చదరపు మీటర్ల (323 చ.అ.) విస్తీర్ణంలో జీ ప్లస్ 1 విధానంలో ఇల్లు కట్టుకోవచ్చు. దీని ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్‌లో 200, మొదటి అంతస్తులో 200 చదరపు అడుగుల చొప్పున నిర్మాణం చేపట్టవచ్చు" అని ఆయన వివరించారు. పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. "పట్టణాల్లో చాలామంది 60 గజాల కంటే తక్కువ స్థలంలో..

మిగతా 2 లో..

## నిజాం ఆస్తులపై కోర్టు కీలక నిర్ణయం

- ఏడో నిజాం ఆస్తుల పంపకాల వివాదంలో కీలక పరిణామం
- ముఖరం జా వారసుల మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు
- రూ.10,000 కోట్లకు పైగా విలువైన 5 రాజమహళ్లపై దావా
- నజఫ్ అలీ ఖాన్ వేసిన పంపకాల దావా పూర్తి విచారణకు మార్గం సుగమం
- షరియత్ చట్ట ప్రకారం వారసులందరికీ హక్కు ఉందని వాదన

2



## జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కాపాడిన హైడ్రా...

### - 38 ఎకరాల భూమి చుట్టూ కంచె నిర్మాణం

- పేట్‌బషీరాబాద్‌లో జర్నలిస్టుల భూమికి హైడ్రా కంచె
- సర్వే నంబర్ 25/2లోని 38 ఎకరాల స్థలానికి భద్రత
- అక్రమ కట్టడాలు, కబ్జాలను నివారించేందుకు చర్యలు
- 2008లో జర్నలిస్టుల సొసైటీకి ఈ భూమి కేటాయింపు
- కోర్టులో కేసు నడుస్తుండటంతో పంపిణీలో జాప్యం



తరంగాలు న్యూస్ / డెస్క్(అక్టోబర్ 23) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్‌బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. సర్వే నంబర్ 25/2లో ఉన్న 38 ఎకరాల స్థలం చుట్టూ హైడ్రా బుధవారం కంచె ఏర్పాటు చేసింది. అక్రమ కట్టడాలు, కబ్జాలు పెరిగిపోతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా రంగంలోకి దిగింది. ఈ 38 ఎకరాల భూమిని 2008లో రాష్ట్ర ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి కేటాయించింది. అప్పటి నుంచి ఈ భూమి హెచ్ఎండీఏ పరిధిలో ప్రభుత్వ అధీనంలోనే ఉంది. అయితే, ఈ కేటాయింపులపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది....

☞ 2

# కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్ కు టికెట్ ఇచ్చింది - కేసీఆర్

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు న్యూస్ / డెస్క్ (అక్టోబర్ 23) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న తరుణంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్‌కు టికెట్ ఇచ్చిందని తీవ్రంగా ఆరోపించిన ఆయన, విజ్ఞులైన జూబ్లీహిల్స్ ప్రజలు అతడిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నిక హైదరాబాద్ నగర ప్రజల తెలివితేటలకు, విజ్ఞతకు ఒక కఠిన పరీక్షగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సన్నాహక సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం గుల్లగా మారింది. శాంతిభద్రతలకు మారుపేరైన హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి. మా పదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నీ కాంగ్రెస్ వచ్చాక కనుమరుగయ్యాయి" అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ దుష్టపాలన గురించి ప్రజలకు మరింతగా వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

ఈ ఉప ఎన్నిక ఫలితం రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని కేసీఆర్ జోస్యం చెప్పారు. "జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తే, ఆ గెలుపు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగుతుంది. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారనే సంకేతాలు వెళతాయి. ఈ ఉప ఎన్నికలో మన విజయం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

## స్థానిక ఎన్నికలపై నిర్ణయం హైకోర్టు తీర్పు తర్వాతే..



మొదటిపేజీ తరువాయి.. సామర్థ్యంతో బ్యాటరీ విద్యుత్ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాతబడిన రామగుండం థర్మల్ ప్లాంట్‌ను కూల్చివేయాలని కూడా నిర్ణయించింది. నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ బాధితుల సమస్యపై కేబినెట్ ప్రత్యేకంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం వారిని పట్టించుకోలేదని విమర్శించారు. శ్రీశైలం నుంచి గ్రావిటీ ద్వారా నీటిని అందించేందుకు 44 కిలోమీటర్ల పొడవైన టన్నెల్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. "ఈ టన్నెల్ నిర్మాణాన్ని పాత పద్ధతిలో కాకుండా, ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం" అని ఆయన పేర్కొన్నారు.

## మంత్రితో వివాదం... ఉద్యోగానికి ఐఏఎస్ అధికారి రాజీనామా..

మొదటిపేజీ తరువాయి..
వీఆర్ఎస్ తీసుకున్నారు. నిజాయతీపరుడైన అధికారిగా పేరున్న రిజ్వీ, వ్యక్తిగత కారణాలతోనే పదవీ విరమణ చేస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ, దీని వెనుక లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ల వివాదం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

**వీఆర్ఎస్‌ను అడ్డుకోవాలని మంత్రి ప్రయత్నం**

మద్యం సీసాలపై అతికించే హై-సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల టెండర్ల ప్రక్రియను రిజ్వీ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. దీనివల్ల పాత వెండర్‌కే ప్రయోజనం చేకూరిందని ఆయన విమర్శించారు. ఈ వ్యవహారంలో రిజ్వీ తీరు తీవ్ర తప్పిదమని, క్రిమినల్ చర్యలకు ఆస్కారం ఉందని పేర్కొంటూ, ఆయన వీఆర్ఎస్ దరఖాస్తును తిరస్కరించాలని కోరుతూ మంత్రి జూపల్లి స్వయంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి (సీఎస్) బుధవారం లేఖ రాయడం కలకలం రేపింది. అయితే, ప్రభుత్వం మంత్రి అభ్యంతరాలను పక్కనపెట్టి రిజ్వీ వీఆర్ఎస్‌ను ఆమోదించింది. ఆయన స్థానంలో వాణిజ్య పన్నుల కమిషనర్ ఎం. రఘునందన్ రావుకు రెవెన్యూ (వాణిజ్య పన్నులు & ఎక్సైజ్) శాఖ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

**వివాదానికి నేపథ్యం ఇదే...**

నకిలీ మద్యం, అక్రమ రవాణా, ఎక్సైజ్ పన్ను ఎగవేతను అరికట్టేందుకు హోలోగ్రామ్‌లు కీలకం. వీటి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని గత ఏడాది ఆగస్టు నుంచే తాను రిజ్వీకి సూచిస్తున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. అయితే, సెప్టెంబర్‌లో రిజ్వీ టెండర్ల నిపుణుల కమిటీని పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదించడమే కాకుండా, ఛైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ ప్రతిపాదనను మంత్రి తిరస్కరించినా, రిజ్వీ ఆ ఫైలును మంత్రిని కాదని నేరుగా ముఖ్యమంత్రికి పంపడంతో వివాదం ముదిరింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 23 కంపెనీలు బిడ్లు దాఖలు చేసినా టెండర్ల ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో, ఈ ప్రతిష్టంభన నడుమ రిజ్వీ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

**రాజకీయ రంగు పులుముకున్న వివాదం**

ఈ పరిణామంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు అవినీతి సొమ్ము పంపకాల విషయంలో గొడవ పడుతున్నారని, దానికి అధికారులు భాగస్వాములు కాకపోవడంతో వారిని వేధిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంత్రి జూపల్లి చెప్పిన మాట వినలేదన్న కోపంతోనే రిజ్వీ వీఆర్ఎస్‌ను కూడా అడ్డుకోవాలని చూశారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అక్రమాల్లో భాగస్వాములైతే గతంలో కొందరు అధికారుల మాదిరిగా జైలుకు వెళ్లాల్సి వస్తుందని తెలిసే అధికారులు పదవుల నుంచి తప్పుకుంటున్నారని కేటీఆర్ గురువారం వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో సెక్స్ రాకెట్ గుట్టురట్టు - విదేశీ యువతికి విముక్తి

మొదటిపేజీ తరువాయి.. అరెస్ట్ చేశారు. అతనితో పాటు ఏడుగురు విటులను, హోటల్ రిసెప్షనిస్ట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. విటులంతా కర్నూలుకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. 'స్టైల్ మేకర్ సెలూన్' యజమాని అయిన ఎండీ షరీఫ్, ఆర్థికంగా వెనుకబడిన, ఉద్యోగాలు లేని యువతులను లక్ష్యంగా చేసుకుని ఈ దందాను నడుపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వారికి పెద్ద మొత్తంలో జీతాలు, కమీషన్లు ఇస్తామని ఆశ చూపి వ్యభిచార కూపంలోకి దింపుతున్నాడని పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 5,950 నగదు, 13 మొబైల్ ఫోన్లు, 12 వాడని కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ సర్కార్ మరో ముందడుగు.. - పట్టణాలకు విస్తరించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం

మొదటిపేజీ తరువాయి.. రేకుల షెడ్లలో నివసిస్తున్నారు. వారికి పక్కా ఆర్సీసీ ఇల్లు అందించాలనే ఉద్దేశంతోనే జీ+1 నిర్మాణాలకు అనుమతి ఇచ్చాం. ఈ నిర్ణయంతో పట్టణాల్లోని మురికివాడల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ జీ+1 విధానంలో ఇంటి నిర్మాణానికి కూడా ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు జీవోలో పేర్కొన్నారు. బేస్‌మెంట్ లెవల్, రూఫ్ లెవల్, మొదటి అంతస్తు నిర్మాణం, ఇల్లు పూర్తయ్యాక విడతలవారీగా ఈ సాయం అందుతుంది. జీ+1 పద్ధతిలో నిర్మించే ఇంట్లో కనీసం రెండు గదులు, ఒక వంటగది, ప్రత్యేక మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్సీసీ స్లాబ్‌తో నిర్మించే ఈ నిర్మాణాలకు హౌసింగ్ శాఖ డీఈఈ అనుమతి తప్పనిసరి అని ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

## జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కాపాడిన హైడ్రా... - 38 ఎకరాల భూమి చుట్టూ కంచె నిర్మాణం

మొదటిపేజీ తరువాయి..
కోర్టులో కేసు విచారణలో ఉండగానే, ఈ ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని జర్నలిస్టుల సొసైటీ ప్రతినిధులు, రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులతో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆక్రమణలు నిజమేనని నిర్ధారించుకుంది. దీంతో, ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్న ఇళ్లను మినహాయించి, మిగిలిన ఖాళీ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. కొంతమంది స్థానికులు అధికారుల చర్యలను అడ్డుకునే ప్రయత్నం చేయగా, ప్రభుత్వ భూమిని కాపాడటమే తమ ఉద్దేశమని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కోర్టు తీర్పు వచ్చిన తర్వాతే స్థల కేటాయింపులపై నిర్ణయం ఉంటుందని, ఆలోగా కొత్తగా ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి, వారి వద్ద ఉన్న రికార్డులను పరిశీలిస్తామని కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ, హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు కూడా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.





## నిజాం ఆస్తులపై కోర్టు కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు న్యూస్ / డెస్క్ (అక్టోబర్ 23) : ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు చెందిన వేల కోట్ల రూపాయల విలువైన రాజమహాళ్ల పంపకాల వివాదంలో ఆయన వారసులకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఆస్తుల పంపకాలపై దాఖలైన దావాను కొట్టివేయాలని కోరుతూ ఎనిమిదో నిజాంగా గుర్తింపు పొందిన ముఖరం జా కుమారుడు అజ్మత్ జా, కుమార్తె షెకర్ జా దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు గురువారం తోసిపుచ్చింది. దీంతో అసలు కేసులో పూర్తిస్థాయి విచారణకు మార్గం సుగమమైంది. ఏడో నిజాం మనవళ్లలో ఒకరైన నవాబ్ నజఫ్ అలీ ఖాన్, తన తాత ఆస్తులను వారసులందరికీ పంచాలని కోరుతూ 2021లో ఈ దావా వేశారు. ఫలక్‌నుమా ప్యాలెస్, చౌమహల్లా ప్యాలెస్, పురానీ హవేలీ, కింగ్ కోఠి ప్యాలెస్‌తో పాటు ఊటీలోని హేర్‌వుడ్ అండ్ సెడార్స్ బంగ్లా వంటి ఐదు చారిత్రక ఆస్తుల పంపకం జరగాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఆస్తుల ప్రస్తుత విలువ రూ.10,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ కేసును విచారణకు స్వీకరించవద్దని అజ్మత్ జా, షెకర్ జా కోర్టును ఆశ్రయించారు. అయితే నజఫ్ అలీ ఖాన్ తరఫు న్యాయవాది తమ వాదనలు వినిపిస్తూ, ఏడో నిజాం చట్టబద్ధమైన వారసుడిగా పిటిషనర్‌కు



పూర్వీకుల ఆస్తులపై హక్కు ఉందని తెలిపారు. ఆస్తుల యాజమాన్యం, వాస్తవాధీనం, విలువ వంటి అంశాలను పూర్తిస్థాయి విచారణ ద్వారానే తేల్చగలమని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసి, అసలు దావా విచారణకు అనుమతించింది. 1967 ఫిబ్రవరి 24న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మరణించిన తర్వాత, భారత ప్రభుత్వం ఆయన మనవడు ముఖరం జాను వారసుడిగా గుర్తించింది. అయితే, నిజాం ప్రైవేట్ ఆస్తులను ఇస్లామిక్ షరియత్ చట్టం ప్రకారం ఆయన 34 మంది సంతానానికి సమానంగా పంచాలని, కేవలం ఒకే వ్యక్తి ఆస్తులను అనుభవించడం సరికాదని నజఫ్ అలీ ఖాన్ వాదిస్తున్నారు. ఈ కేసులో మొత్తం 232 మంది ప్రతివాదులుగా ఉండగా, వారిలో ఫలక్‌నుమా ప్యాలెస్‌ను నిర్వహిస్తున్న ఇండియన్ హోటల్స్ కంపెనీ కూడా ఉంది.

## మహాకూటమి పోస్టర్ల నుంచి రాహుల్ గాంధీ మాయం!

తరంగాలు న్యూస్ / డెస్క్ (అక్టోబర్ 23) :
బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కూటమి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా కలకలం రేపుతోంది. పాట్నాలోని మౌర్య హోటల్‌లో నేడు జరగనున్న ఈ మీడియా సమావేశం పోస్టర్‌లో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఫొటోను ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పక్షాల నేతల చిన్న ఫొటోలు ఉన్నా, రాహుల్ గాంధీ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు.

ఈ పరిణామంపై బీజేపీ వెంటనే విమర్శలు ఎక్కుపెట్టింది. "నిన్నటి వరకు రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రం అన్నారు. కానీ ఇప్పుడు చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి ఒక లక్ష్యం గానీ, ఒక దార్శనికత గానీ లేవు. గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప ఏమీ లేదు. ఇంకా అభ్యర్థులనే ఖరారు చేయలేని పరిస్థితిలో ఉన్నారు" అని బీజేపీ నేత షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేశారు. మరో బీజేపీ నేత ప్రదీప్ భండారి స్పందిస్తూ "తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అవమానించారు. మహాకూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య మహాభారతం కొనసాగుతోంది" అని ఆరోపించారు.

**తేజస్వి వైపే మొగ్గు.. వ్యూహం ఇదే!**

మరోవైపు, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ప్రకటించేందుకు కూటమిలోని అన్ని పార్టీలు అంగీకరించినట్లు ఆర్జేడీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. "చలో బీహార్, బద్లేం బీహార్" (పదండి బీహార్, మారుద్దాం బీహార్) అనే నినాదంతో ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం.

కేంద్రం, బీహార్ ప్రభుత్వాలు మహిళలకు రూ. 10,000 నగదు బదిలీ పథకాలను ప్రకటించడంతో, వాటి ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ 'కులం కార్డు'ను ప్రయోగించక తప్పలేదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎన్నికలకు ముందు తేజస్విని సీఎం అభ్యర్థిగా బలంగా ప్రొజెక్ట్ చేయడం ద్వారా యాదవ (14 శాతం), ముస్లిం (18 శాతం) ఓట్లను పూర్తిగా ఏకం చేయవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ 32 శాతం ఓటు బ్యాంకుతో ఎన్నికల బరిలో కూటమికి గట్టి




పునాది పడుతుందని అంచనా వేస్తున్నారు.

**కొలిక్కిరాని సీట్ల పంపకాలు**

నామినేషన్ల ఉపసంహరణకు నేడే చివరి రోజు అయినప్పటికీ, మహాకూటమిలో దాదాపు డజను సీట్లపై ఇంకా వివాదం కొనసాగుతోంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బుధవారం పాట్నా చేరుకున్నారు. ఆయన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌తో సమావేశమయ్యారు. అనంతరం, 243 సీట్లున్న అసెంబ్లీలో 5-10 స్థానాల్లో 'స్నేహపూర్వక పోటీ' ఉండటం పెద్ద సమస్య కాదని గెహ్లాట్ వ్యాఖ్యానించారు.

## జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా



మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్.23, తరంగాలు : జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మరీనా పెయింట్ ప్రైవేటు లిమిటెడ్, కరీంనగర్, కంపెనీలో ఖాళీగా ఉన్న అడ్మిన్ మేనేజర్, అకౌంట్స్, టెలికాలర్, స్టోర్ ఇంచార్జ్, హెచ్.ఆర్.టీమ్, డేటా ఎంట్రీ, లీగల్ టీమ్, ఆఫీస్ సబార్డినెట్ తదితర పోస్టులకు అర్హత కల్గిన 18-35 వయసు గల స్త్రీ,పురుష అభ్యర్థులకు ఉద్యోగవకాశాలను కల్పించుటకు తేది: 25.10.2025 న జిల్లా ఉపాధి కార్యాలయం లో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి. రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థులు తేది:25.10.2025 న ఉదయం 10.30 గం.ల నుండి మధ్యాన్నం 2.00 గం.ల వరకు జిల్లా కలెక్టరేట్ లోని ఎంప్లాయ్మెంట్ కార్యాలయంలో జరుగు జాబ్ మేళాకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయంలో సంప్రదించి వివరాలు పొందవచ్చునని అన్నారు.

## రైతు సంతోషంగా ఉండడమే తెలంగాణ అభివృద్ధికి మూలం

**- మొక్కల కొనగోలు కేంద్రాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు డా. మురళీ నాయక్**

**- ఎమ్మెల్యే డా మురళీ నాయక్**



మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : మహబూబాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్ గురువారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికారు. రైతులు పండించిన పంటను పరిశీలించి, కొనుగోలు కేంద్రాల సదు-పాయాలను ఎమ్మెల్యే డా మురళీ నాయక్ సమీక్షించారు. ఎమ్మెల్యే స్థానిక రైతులతో ముచ్చటించి మొక్కలను కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకోవాలిసిన జాగ్రత్తలను సూచించారు. రైతులను ఎవరైనా ఇబ్బంది పడితే వెంటనే సమాచారం ఇవ్వాలి. ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదు, అని కఠిన హెచ్చరిక జారీ చేశారు. అలాగే, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తూకాలు, తేమ శాతం కొలిచే పరికరాలు సక్రమంగా పనిచేయాలని, చెల్లింపులు సమయానికి జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రతి రైతు కష్టం ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయి. రైతు సంతోషంగా ఉండడమే తెలంగాణ అభివృద్ధికి మూలం, అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు దిగబడి పట్ల అవగాహన కల్పించుకోవాలని, తక్కువ ఎరువులను వాడుతు అధిక దిగుబడులు వచ్చే విధంగా శాస్త్రీయ కోణంలో వ్యవసాయం చేయాలని, పంటకు పంటకు మధ్య డ్రాప్ హాలిడే చేస్తూ వ్యవసాయని కొనసాగించాలని తద్వార తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు అని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ లోయ, మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సహకార సంఘం అధికారులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు, పట్టణ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## సిపిఎం నాయకుడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

తొర్రూర్ అక్టోబర్ 23 తరంగాలు : తొర్రూరు మండల సిపిఎం నాయకుడు కొమ్మనబోయిన యాకయ్య, ఆయన భార్య పుష్పపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు అయ్యింది. వివరాల్లోకి వెళ్తే తొర్రూరు పట్టణానికి చెందిన వేర్పుల మహేష్ అనే వ్యక్తి అన్నారం రోడ్డులోని టిఫిన్ సెంటర్ సమీపంలో ఫోన్‌లో మాట్లాడుతుండగా, అక్కడికి వచ్చిన యాకయ్య దంపతులు మా గురించే మాట్లాడుతున్నావా..? అంటూ ప్రశ్నించారని, అనంతరం మహేష్‌పై దాడి చేయడంతో పాటు కులపేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.వేర్పుల మహేష్ ఫిర్యాదు మేరకు తొర్రూరు పోలీసు స్టేషన్‌లో



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సబ్ ఇన్‌స్పెక్టర్ గొల్లపూడి ఉపేందర్ తెలిపారు.

## కల్లుగీత కార్మికులకు ఎక్స్గ్రేషియా వెంటనే ఇవ్వాలి

- ❖ కేజీ కేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న
- ❖ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పల్లె దయాకర్ గౌడ్, దీకొండ మధు గౌడ్

తొర్రూర్, అక్టోబర్ 23 తరంగాలు : ప్రభుత్వం కల్లుగీత కార్మికులకుఇచ్చిన మాటను నిల బెట్టుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం మానుకోట జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న, అన్నారు. మండల కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన కేజీ కేఎస్ 5వ,మండల మహాసభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైనగునిగంటి మోహన్, గౌని వెంకన్న గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన మాటను నిల బెట్టుకోవాలని, గీత కార్మికులకు రావలసిన ఎక్స్ గ్రేషియా 20 లక్షలు,ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఎక్స్గ్రేషియా నిధులను వెంటనే అందేలా చూడాలని,గీత కార్మికులకు మోటార్ సైకిల్ లను,సేఫ్టీ మోకులను వెంటనే అందజేయాలని అన్నారు.కల్లుగీత కార్మిక సంఘం మొదటి నుండి కార్మిక సంఘం చేసిన పోరాటాలను ప్రతి ఒక్క గౌడ బిడ్డ గుర్తుపెట్టుకుని ఏమాత్రం తగ్గకుండా అదే స్ఫూర్తిని తర్వాత తరానికి అందించాలని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలలో ఉన్న గౌడ బిడ్డలు వారి యొక్క సత్తా చాటుకునే రోజులు వచ్చాయని ప్రతి ఒక బిడ్డ కలిసికట్టుగా కల్లుగీత కార్మిక సంఘం ఐక్యతను ప్రభుత్వానికి చాటి చెప్పేలా చూడాలని ఉన్నారు. కేజీకేఎస్ కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్నప్పటికీ దానిని బలోపేతం చేయడానికి నా యొక్క సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా చేయాలని, ప్రతి గౌడ కుటుంబానికి ఒక కొడుకులా ముందుండిఅన్ని విధాలుగా అండగా నిలబడి కాపాడుకోవాలని అన్నారు. సమావేశం అనంతరం తొర్రూర్ మండల కేజీ కేఎస్ నూతన కమిటీని




ప్రకటించారు. అధ్యక్షులు గా పల్లె దయాకర్ గౌడ్, గౌరవ బొలగాని మురళి గౌడ్, ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్ చీకటి రమేష్ గౌడ్, దీకొండ సురేష్ ,కార్యదర్శి దీకొండ మధు,సహాయ కార్యదర్శి మొగుళ్ల సంపత్, కోశాధికారిగా పులి సతీష్, సభ్యులుగాక కమ్మగాని బిక్షం, మల్లయ్య, దీకొండ సురేష్, రమేష్ ,సోషల్ మీడియా కన్వీనర్ అశోక్ లను ప్రకటించారు.

## కళాకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలి

### - టి పి యస్ కే యస్ రాష్ట్ర అధ్యక్షులు కుడుముల కుమార్





జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 23, (తరంగాలు) రాష్ట్రంలో ఉన్న కళాకారులను ప్రభుత్వం గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాల వర్తింపజేయాలని ప్రజా సాంస్కృతిక కళాకారుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు కుడుముల కుమార్ అన్నారు. జనగామ జిల్లా జఫర్గడ్ మండల కేంద్రంలో జనగామ జిల్లా ముఖ్య కళాకారుల సమావేశం జరిగింది. ఈ సమావే శంలో రాష్ట్ర కమిటీ ముఖ్య నాయకులు హాజరై మాట్లాడారు కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రొయ్యల రాజు, ఉపాధ్యక్షులు కొయ్యడ, చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిబొజ్జ ఇందు, సహాయ కార్యదర్శి రజిత కోశాధికారి రాధిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి, గోలి కవిత, పాల్గొని మాట్లాడారు, ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నేపథ్యంలో కొద్దిమంది కళాకారులను మాత్రమే గుర్తించి వారికి పెన్షన్ ఇస్తున్నారని కళాకారులందర్నీ గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు పలు దేవాలయా లు టూరిస్ట్ ప్రదేశాల్లో కళాకారులకు కళావేదికలు ఏర్పాటు చేసి వారికి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఝరాష్ట్ర ప్రచార కార్యదర్శి గోలి కవిత రాష్ట్ర కమిటీ బాధ్యత లును శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షులు మాచర్ల నీల జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె అరుణ, కమిటీ సభ్యులు రొడ్డ తార, బోడ సంధ్యారాణి, గ్రామాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు జడ్జి గవాయి పై దాడి అమానుషం

కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : గురువారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ అంబేద్కర్ సెంటర్లో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు జెల్లంపల్లి శ్రీకాంత్ అధ్యక్షతన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి పార్టీ జిల్లా నాయకులు కంటిపూడి అరుణ్ కుమార్ మాదిగ బిర్రు యుగేందర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం అయినటువంటి సుప్రీంకోర్టు సీజేఐ డాక్టర్ బి.ఆర్ గవాయి గారి మీద జరిగినటువంటి పాషవిక దాడి చాలా ఘోరమని మరియు దళిత జాతికి అవమానకరమని వారు అన్నారు రానున్న రోజుల్లో దళితులకు బీసీలకు మైనారిటీలకు ఈ భారత దేశంలో రక్షణ లేకుండా పోతుందని వారు అన్నారు. ఇకనైనా భారతదేశాన్ని పరిపాలిస్తున్నటువంటి బిజెపి పార్టీఈ యొక్క చర్యను వెంటనే ఖండిస్తూ సీజేఐ గారి మీద దాడి చేసిన వ్యక్తిని మరియు అతని వెనుక ఉన్నటువంటి అగ్రకుల పెత్తందారులను మతోన్మాదులను వెంటనే గుర్తించి అత్యంత కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా ఈ యొక్క దాడిని నిరసిస్తూ నవంబర్ ఒకటవ తారీఖున హైదరాబాదులో జరుగుతున్నటువంటి నగర నిర్బంధ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రజలు



కళాకారులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ముఖ్య నాయకులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అమీనాపురం నాయకులు జన్ను కృష్ణమాదిగ, జన్ను చంటి మాదిగ, జన్ను రాజేందర్,మాదిగ మైనారిటీ నాయకులు ఎస్ కే ఇమామలి బీసీ నాయకులు శీలం భీష్మ అంబేద్కర్ సంఘం టౌన్ ప్రధాన కార్యదర్శి జెల్లంపెల్లి సుధాకర్ టౌన్ మున్నూరు కాపు సంఘం నాయకులు మురళి కూరగాయల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి శివధర్ రెడ్డిని కలిసి చింతపల్లి వెంకటయ్య గౌడ్

కల్వకుర్తి, అక్టోబర్ 23, తరంగాలు ప్రతినిధి : హైదరాబాద్ లోని లక్డికాపూల్ డిజిపి కార్యాలయం లో తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారి డిజిపి శివధర్ రెడ్డిని మాడుగుల మండలం కలకొండ గ్రామానికి చెందిన చింతపల్లి వెంకటయ్య గౌడ్ కలిసి శాలువాతో పుష్పగుచ్చంతో సన్మానించారు.ఈ సందర్భంగా డీజీపీ కి కలకొండ గ్రామంలో ఇటీవల జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ గేట్స్ సీ.సీ. కెమెరాలు ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ దృష్టిలో పెట్టుకొని గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందని, సైబర్ క్రైమ్స్ దొంగతనాలు వంటి వాటిని అరికట్టేందుకు కలకొండ గ్రామంలో సీ.సీ. కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అవి దొంగతనాలు అరికట్టడం సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందని కెమెరాలు పెట్టించడం జరిగిందని డిజిపి శివధర్ రెడ్డికి చింతపల్లి వెంకటయ్య గౌడ్ తెలిపారు.సీ.సీ.కెమెరాలను భారీ గేట్లను ప్రారంభించడానికి ఒకరోజు ముఖ్యఅతిథిగా రావాలని కోరారు.ఈ కార్యక్రమంలోనాగిల్ల మాసయ్య. చింతపల్లి మల్లేష్. కే యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# క్రైమ్ కేసులను త్వరగా పరిశీలించండి - జిల్లా ఎస్పీ






మహబూబాబాద్, ప్రతినిధి,అక్టోబర్. 23,తరంగాలు : మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుధీర్ రాంనాథ్ కేకన్, ఐపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా క్రైమ్ మీటింగ్ ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా పరిధిలోని అన్ని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా వ్యాప్తంగా నమోదైన క్రిమినల్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, మహిళా భద్రత, సైబర్ నేరాలు, అక్రమ రవాణాలు, గంజాయి నియంత్రణ చర్యలు, మరియు ప్రజా శాంతి భద్రత అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి అధికారి నుండి వారి పరిధిలోని కేసుల వివరాలు తెలుసుకొని, దర్యాప్తు వేగవంతం చేయాలని, న్యాయం జరుగేలా ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. అలాగే, చట్టం అమలు పరంగా కఠినంగా ఉండడమే కాకుండా, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఇటీవల జిల్లాలో రైతుల కోసం నిర్వహించిన యూరియా పంపిణీ కార్యక్రమం విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన పోలీస్ అధికారులకు మెమెంటో మరియు శాలువా కప్పి ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ అభినందనలు పోలీస్ స్టేషన్ లో ఉన్న ప్రతిఒక్కరికి వర్తిస్తుందని అన్నారు. ఈ సందర్భంలో విధుల్లో క్రమశిక్షణ, సమన్వయం, నిబద్ధతతో పాల్గొన్న అధికారుల పాత్రను ప్రశంసిస్తూ, మహబూబాబాద్ జిల్లా పోలీస్‌కు రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చినందుకు అభినందించారు. క్రైమ్ మీటింగ్ అనంతరం, కోర్ట్ డ్యూటీ లో అద్భుతంగా పనిచేసిన సీడో సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎస్పీ స్వయంగా అందజేశారు. విధుల్లో చూపిన నిబద్ధత, సమయపాలన, మరియు న్యాయ వ్యవస్థతో సమన్వయం చూపినందుకు అధికారులను ప్రోత్సహిస్తూ, ఇతర సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, మరియు వివిధ యూనిట్‌ల ఇన్‌చార్జ్ అధికారులు పాల్గొన్నారు.

# గో రక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

- గో రక్షకుడు ప్రశాంత్ పై ఎం.ఐ.ఎం. గూండాలు కాల్పులు జరపడం బాధాకారం
- ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాము
- గోమాంస నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి







హన్మకొండ ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : గో రక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని హన్మకొండ బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో గో రక్షణ కోసం మరియు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు,సహా 750 మంది కార్యకర్తల అరెస్టులపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గో రక్షణ మరియు గోమాంస నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కు బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంతోష్ రెడ్డి మాట్లాడుతూ బుధవారం రాత్రి ఘట్‌కేసర్ వద్ద అక్రమ పశువుల రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో గో రక్షకుడు ప్రశాంత్ పై ఎం.ఐ.ఎం. గూండాలు కాల్పులు జరిపారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హనుమకొండ జిల్లాలోని బొక్కలగడ్డ, ఔటర్ రింగ్ రోడ్ ప్రాంతాలలో గోమాంస రవాణా మరియు వధ జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. అందువల్ల జిల్లాలో గో రక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ను కోరారు. భారత రాజ్యాంగంలోని 48వ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రం వ్యవసాయం మరియు పశుసంవర్ధకాన్ని ఆధునిక మరియు శాస్త్రీయ పద్ధతులలో ఏర్పాటు చేయుటకై కృషి చేయాలి. ముఖ్యంగా ఆవులు, దూడలు, ఎద్దులు మొదలైన పశువుల వధను నిరోధించుటకు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొనబడింది. రాబోయే రోజుల్లో ఇటువంటి అక్రమ చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వమని మేము హామీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు దొంతి దేవేందర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జా సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సాంద్ర మధు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు తీగల భరత్ గౌడ్ , ఇతర జిల్లా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కపాస్ కిసాన్ యాప్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్ ప్రతినిధి, 23 అక్టోబర్,తరంగాలు : ప్రభుత్వం పత్తి రైతుల కోసం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ఉత్పత్తులను కనీస మద్దతు ధర (ఎంపీఎస్) కు సులభంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమ్ముకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని దేసైపెల్లి, ముద్దునూరు, బంధంపెల్లి, గ్రామాల పత్తి రైతులకు కిసాన్ యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు స్లాట్ బుకింగ్, పేమెంట్ ట్రాకింగ్, ఆధార్, భూమి రికార్డుల ద్వారా సులభంగా నమోదు చేసుకోవడం వంటి సదుపాయాలున్నాయని అన్నారు. ఆధార్ నంబర్‌తో స్వీయ-నమోదుతో పాటుమార్కెట్‌లో రద్దీని తగ్గించడానికి , క్యూలను నివారించడానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్మకాలు జరుపుకోవడంతో పాటు పేమెంట్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా లావాదేవీలలో పారదర్శకతను అందిస్తుందన్నారు. ముందుగా ప్లేస్టోర్ నుంచి కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌లో ఆధార్, భూమి రికార్డులు (పట్టాదారు పాస్‌బుక్), పంట రకం, విస్తీర్ణం, ఇతర అవసరమైన వివరాలను నమోదు చేయాలన్నారు. పత్తి అమ్మాలనుకుంటున్న మార్కెట్‌ను ఎంచుకుని స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన పత్తి కి మంచి మద్దతు ధర రూ.8110 వస్తుందని తెలియచేశారు. పత్తి ఏరడానికి కాటన్ బ్యాగ్స్, పాత చీరలు వాడాలని, ప్లాస్టిక్ సంచులు వాడరాదని, తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెంటర్స్, మరియు ప్రైమరీ స్కూల్స్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ , నర్సంపేట ఎడిఏ దామోదర్ రెడ్డి , వ్యవసాయ అధికారి మాధవి, ఏఈఓ లు హనుమంతు, విజయ్, రాజేశ్ ఆయా గ్రామాల పత్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పురావస్తు పరిశోధనశాలను సందర్శించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 23,తరంగాలు వరంగల్ జిల్లా పురావస్తు పరిశోధన, ప్రదర్శనశాలను గురువారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. అక్కడ ఉన్న శిలాశాసనాలు, విగ్రహాలు, శిల్పకళా సంపదను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ చరిత్ర, కాకతీయుల సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ప్రాంతపు వారసత్వాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎంపీ అన్నారు. జిల్లా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సంరక్షణా పనుల గురించి ఎంపీ ఆరా తీశారు. పురాతన శిల్పకళ, కాకతీయ శిలాశాసనాలు తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేస్తున్నాయని, వీటి సంరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు. జిల్లా పురావస్తు అధికారులు ఎంపీకి వివిధ శిల్ప సంపద, ప్రాచీన నాణేలు, శాసనాల చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతపై కళాకారుల ప్రదర్శన



కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఆర్ఓ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి దర్శనం యుగేందర్ కళాబృందం కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో యువత మదకద్రవ్యలకు దూరంగా ఉండాలని సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా జాగ్రత్త వహించాలని పరిసరాల పరిశుభ్రత మూఢనమ్మకాలు అక్షరాస్యత పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది పాల్గొన్న కళాకారులు గిద్దె రామ్ నరసయ్య, మెరుగు రవీందర్ గౌడ్, ముణికుంట్ల ఐలేష్ కుమార్, బొడ్డు కుమారస్వామి, ఆరెపల్లి నరేష్, భక్కి యాదయ్య, బోడ పరమేష్, పందుల బిక్షపతి, కొదమూరు కీర్తి, వజ్జ రాజ్యలక్ష్మి, డాంగి రోజా, పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కూసుమంచి ఎంఈవో బీవీ రామాచారి
- కస్తూర్బాగాంధీ పాఠశాల సందర్శనలో సిబ్బందికి పలు సూచనలు

పాలేరు ఆర్సీ, 23 అక్టోబర్ (తరంగాలు) విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కూసుమంచి ఎంఈవో బీవీ రామాచారి తెలిపారు. గురువారం కూసుమంచి మండలంలోని గంగబండ తండా వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాల, భోజనశాల పరిశీలించారు. వంట సిబ్బంది పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎంఈవో మధ్యాహ్న భోజనం చేశారు. సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజితకుమారి, ఇతర సిబ్బంది ఉన్నారు.





# నిత్యకు అండగా ఉంటాం

## - రూ.5 లక్షల చెక్కును అందజేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




నల్గొండ ఆర్సీ, అక్టోబర్ 23, తరంగాలు తల్లి, తండ్రి, సోదరుడిని కోల్పోయి అనాథగా మిగిలిపోయిన మాడుగుల పల్లి మండలం, ఆగమోత్కూరుకు చెందిన బాలిక నిత్యకు అండగా ఉంటామని,ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు.గురువారం ఆమె నల్గొండ జిల్లా, వేములపల్లి మండల కార్యాలయంలో చేపట్టిన ఆధునికీకరణ పనుల పరిశీలన నిమిత్తం వేముల పెల్లికి వచ్చారు.కాగా మాడుగుల పల్లి మండలం ఆగమోత్కూరుకు చెందిన తండ్రి, కొడుకులు పున్న సాంబయ్య ,శివమణిలు గణేష్ నిమజ్జనం సందర్భంగా వేములపల్లి వద్ద ఉన్న కాలువలోకి దిగి ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతు కాగా , ఇదివరకే తల్లిని కోల్పోయిన చిన్నారి నిత్య తండ్రి, సోదరున్ని కూడా కోల్పోవడంతో అనాథగా మిగిలిపోయింది. విషయం తెలిసిన జిల్లా కలెక్టర్ చిన్నారి నిత్యకు అండగా నిలిచే క్రమంలో భాగంగా వేములపల్లి తహసిల్దార్ కార్యాలయంలో నిత్యకు 5 లక్షల రూపాయల చెక్కును అందించి ధైర్యం చెప్పారు. ధైర్యంగా ఉండాలని,బాగా చదువుకోవాలని అన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, వేములపల్లి, మాడుగుల పల్లి తహసిల్దార్లు హేమలత, సరోజ పావని, డిప్యూటీ తహసిల్దార్ తదితరులు ఉన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పాలేరు ఆర్సీ, 23అక్టోబర్, తరంగాలు పాలేరు నియోజకవర్గం లోని కాకరవాయి. ముజాయితీపురం, సోలిపురం, పాలేరు, వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం కాకరవాయి ముజాయితీపురం ,సోలిపురం, పాలేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పక్క సమాచారంతో ట్రాక్టర్లను సోలిపురం నుండి తిరుమలయపాలెం మార్గమధ్యలో ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు .నాలుగు ఇసుక ట్రాక్టర్ల పై కేసు నమోదు చేసి సేఫ్ కస్టడీ కింద తహసిల్దార్ కు అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కు ఇసుక రవాణా చేయాలంటే ముందుగా తహసిల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్ణయించిన



రుసుం చెల్లించి కూపన్ ద్వారా తోలకాలు జరపాలని అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

## - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కల్వకుర్తి, అక్టోబర్ 23, తరంగాలు ప్రతినిధి : గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం కల్వకుర్తి పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వంటశాల, నిల్వ గదులు తదితర విభాగాలను పరిశీలించి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చూపిన ఎవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు చదువుతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జీవితంలో ముందుకు సాగేందుకు విద్యే మూలం అని సూచించారు. కలెక్టర్ ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించి, విద్యార్థినీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రోజువారీ మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అని ఆరా తీశారు. ఆహార పదార్థాల నిల్వలు, పరిశుభ్రత, వంట సామాగ్రి పరిస్థితి వంటి అంశాలను పూర్తిగా తనిఖీ చేశారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి , కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు గౌరవం తెచ్చిపెట్టాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 100శాతం ఉత్తీర్ణత సాధిస్తే లక్ష రూపాయల చొప్పున బహుమతి అందజేస్తానని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. సమస్యలను అధిగమించి విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపుకు అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్యానందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల భవిష్యత్తు పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలి, ప్రభుత్వం నుండి సరిపడా రేషన్ సరఫరా జరుగుతోంది. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి. అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.అలాగే వంట సిబ్బందికి బియ్యాన్ని ఒకరోజు ముందే శుభ్రం చేసి సిద్ధం చేయాలని, వంట గది పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టోర్ రూమ్, కూరగాయల నిల్వ గదులను పరిశీలించి అవి కూడా చక్కగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు ఉండాలి, సమయాన్ని వృథా చేయకుండా విద్యపై దృష్టి పెట్టాలి. కష్టాలు వచ్చినా చదువును పక్కన పెట్టకండి, విద్యార్థులు విషయాన్ని అర్థం చేసుకుంటూ విద్య నేర్చుకుంటేనే మీరు భవిష్యత్తులో విజయవంతం అవుతారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు బోధన పద్ధతులు అవలంబించాలి. విద్యార్థుల అభ్యాస స్థాయిని అర్థం చేసుకొని ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని యాదమ్మ, స్థానిక తహసిల్దార్ ఇబ్రహీం, పాఠశాల ప్రిన్సిపల్ వీరభద్రం, హాస్టల్ వార్డెన్ కృష్ణవేణి తదితరులు ఉన్నారు.







# కనీస మద్దతు ధర పై పత్తి కొనుగోలు సిద్ధంగా ఉండాలి

- రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకుని రావాలి
- పత్తి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన
- పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్



మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో వచ్చే పత్తి పంటను కనీసం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ అన్నారు.గురువారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ కలెక్టరేట్ లో పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో పత్తి కొనుగోలు యాక్షన్ ప్లాన్ ను అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ సీజన్లో మహబూబాబాద్ జిల్లాలో 84 వేల 718 ఎకరాలలో పత్తి పంట సాగు జరిగిందని, 6 లక్షల 14 వేల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా ఉందని అన్నారు.జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి పంట కొనుగోలు చేసేందుకు 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.కనీస మద్దతు ధర రూ.8110/- ఉన్నదని. పత్తి రైతులు తమ పత్తిని తక్కువ ధరకు దళారులకు కానీ, మధ్యవర్తులకు కానీ, ఇతరులకు కానీ అమ్ముకోకుండా పత్తి ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉన్నప్పుడు సీసీఐ వారిచే మహబూబాబాద్ మార్కెట్ యార్డ్ పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లు, కేసముద్రం మూడు జిన్నింగ్ మిల్లులు, తొర్రూరు మార్కెట్ యార్డ్ రెండు జిన్నింగ్ మిల్లులు, మొత్తం 6 పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.పత్తి రైతులు తమ పత్తిని తీసుకొని వచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పరిగణలోకి తీసుకొవాలని , నాణ్యమైన పత్తి పంటను వెంటనే కనీస మద్దతు ధర పై కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పత్తి పంట కొనుగోలు నిమిత్తం జిన్నింగ్ మిల్లులో నీరు, టాయిలెట్ అవసరమైన పరికరాలు మొదలగు సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు పత్తి పంట తీసుకొని వచ్చే రైతులు తమ బ్యాంకు ఖాతాలు ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, దీనిపై రైతులలో అవసరమైన అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో ఉంచాలని అన్నారు.రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర కంటే తక్కువకు పత్తి పంట అమ్మవద్దని, మధ్య వర్తులను నమ్మి మోసపోవద్దని, ప్రైవేట్ వ్యాపారుల వద్ద మద్దతు ధర లభించని పక్షంలో నేరుగా జన్మింగ్ మిల్లులకు వచ్చి పత్తి పంట అమ్ముకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలు పటిష్టంగా తీసుకోవాలని సూచించారు. అలాగే కప్పాస్ కిసాన్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, అలాగే పత్తి అమ్ముకోవడానికి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి , జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, అసిస్టెంట్ రవాణా శాఖ అధికారి సాయి చరణ్, మార్కెట్ కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు ఓనర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రం లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే మురళీ నాయక్..

- సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపాల్ పై ఎమ్మెల్యే ఫైర్
- సోషల్ వెల్ఫేర్ గురుకులంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే ఆరా
- విద్య ద్వారానే సమాజ అభివృద్ధి
- ఎమ్మెల్యే మురళీ నాయక్






మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : గత పదేళ్లుగా విద్యావ్యవస్థ భ్రష్టుపట్టింది . నిధులు లేమి, ఉపాధ్యాయులు రిక్రూట్మెంట్ లేక విద్యావ్యవస్థ కుని అయిందని ఎమ్మెల్యే మురళి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్ రెడ్డి గారు గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మూతపడిన స్కూలు తెరిపించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్య పక్షపాతి ప్రభుత్వమని నిరూపించబడిందని మహబూబాద్ ఎమ్మెల్యే డా.మురళి నాయక్, అన్నారు.గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని సమస్యలు తల్లిదండ్రులకు చెబితే ఉపాధ్యాయులు బెదిరిస్తున్నారని కొంతమంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారని దీంతో పాటుగా వివిధ తరగతులకు చెందిన విద్యార్థుల తో ఎమ్మెల్యే డా భూక్యా మురళి నాయక్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ గురుకులాలలో పరిసరాలు అపరిశుభ్రంపై ఎమ్మెల్యే మురళి నాయక్ ప్రిన్సిపాల్ పై ఫైర్ అయ్యారు. మీ ఇల్లు అయితే ఇలానే ఉంచుకుంటారా అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతుంటే ఇంత నిర్లక్ష్యం సరికాదని హెచ్చరించారు. మళ్లీ నేను ఆకస్మిక తనిఖీ చేస్తానని అప్పుడు కూడా ఇదే చర్యలు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు..

**ప్రిన్సిపల్ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం....**

సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపల్ పై ఎమ్మెల్యే మురళి నాయక్ ఫైర్ అయ్యారు. గురుకులాల్లో ఉన్న సమస్యలను తల్లిదండ్రులకు కానీ ఇతరులకు గాని చెబితే ప్రిన్సిపల్ బెదిరిస్తున్నారని ఈ పద్ధతి సరైనది కాదని వార్నింగ్ ఇచ్చారు. విద్యార్థులపై విద్యావ్యవస్థ పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు.

# ప్రమాణానికి సిద్ధమా కేటీఆర్

- పదేళ్లలో నీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్కీంలన్ని స్కామ్ గానే మిగిలిపోయాయి
- లిక్కర్ పై మాట్లాడే అర్హత లేని కుటుంబం మీది
- దయ్యాలు వేదాలు వల్లించినట్లు డ్రామా రావు మాటలు
- సీఎం రేవంత్ రెడ్డి పై అసత్య ప్రచారాలు చేస్తే ఖబర్దార్
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు







హైదరాబాద్, అక్టోబర్ 23, తరంగాలు పదేళ్ల పాలనలో మీరు అవినీతి చేయలేదని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి సాక్షిగా ప్రమాణానికి నవ్వు సిద్ధమా కేటీఆర్ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ సవాల్ విసిరారు. గురువారం హైదరాబాద్ నాంపల్లి లోని గాంధీభవన్ లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,కేఆర్ నాగరాజు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కేటీఆర్ (డ్రామా రావు) నిన్ను ఒక ఔవుల అనాల, ఏం అనాలో అర్థం కావడం లేదన్నారు. అసలు లిక్కర్ పై మాట్లాడే అర్హత లేని కుటుంబం మీది అని, లిక్కర్ అంటేనే కల్వకుంట్ల కుటుంబం అని ప్రజలందరికీ తెలుసు అన్నారు.ప్రపంచంలోని బిడ్డలందరూ అవమానపడే విధంగా తెలంగాణ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన ఉన్నదన్న కేటీఆర్ ఆనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కేటీఆర్ నేను నిన్ను ముక్కుసూటిగా అడుగుతున్న పదేళ్లలో దోచుకున్నది చాలక ఢిల్లీ వరకు పోయి ఢిల్లీలో కూడా నీ చెల్లి లిక్కర్ దందా చేసి అడ్డంగా దొరికే తీహారు జైలు పాలు అయినది ప్రజలందరికీ తెలియదా అన్నారు.తీహార్ జైల్లో ఎవరెవరిని వేస్తారు అనేది ప్రజలకు తెలియదా అత్యంత నేర చరిత్ర కలిగి ఉన్నవారిని వేసే జైళ్లలో నీ చెల్లె నీ లిక్కర్ దందాలో వేశారు మీరు ఎలాంటి దొంగలు అనేది తెలంగాణ ప్రజలందరికీ తెలుసు అన్నారు. మీడియా ముందుకు వచ్చి ప్రజలను ఉన్నది లేనట్టు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు తస్మాత్ జాగ్రత్త ప్రజలారా అన్నారు.కారు అంటేనే బేకారు అనే విధంగా ప్రజలు తిరస్కరించిన ఇంకా సిగ్గు శరం లేకుండా అచ్చోసిన ఆంబోతుల్లాగా ఊర్ల మీద పడి తిరుగుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి మధ్య 500 కోట్ల లావాదేవీల కొట్లాట జరిగిందని అసత్యాలు ప్రచారం చేస్తూ అసలు నీకు సిగ్గు శరం ఉందా కేటీఆర్ అసలు తెలంగాణలో లిక్కర్ టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. అది తెలియక ప్రజలను మభ్యపెడుతూ ఉన్నది లేనట్టు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బంజారాహిల్స్ లో టానిక్ అనే లిక్కర్ షాప్ పెట్టి మీరు మీ కల్వకుంట్ల కుటుంబం ఎలాంటి దందాలు చేశారో ప్రజలందరికీ తెలుసు అన్నారు.గత పదేళ్లలో నీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్కీం లన్ని స్కామ్ గానే మిగిలిపోయాయి. ఎలక్షన్లు వస్తున్నాయని ముందే లిక్కర్ టెండర్లు పిలిచి కోట్లు దండుకొని తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన ఘనత మీది కాదా...సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ ఉత్తమ ఉద్యోగిగా పనిచేస్తున్న క్రమంలో కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం అతని చేత ఉద్యోగానికి రాజీనామా చేసే కుట్ర చేస్తుందని తప్పుడు అసత్యాలు ప్రచార చేస్తున్న కేటీఆర్ రిజ్వీ నీకేమైనా ఫోన్ చేసి చెప్పాడా బలవంతంగా నన్ను రాజీనామా చేపిస్తున్నారని రాజకీయ పబ్బం కోసం పూటకో మాట మాట్లాడుతున్న డ్రామారావు ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని సరిగా మాట్లాడడం నేర్చుకో లేకుంటే బిడ్డ పండబెట్టి తొక్కుతాము.నీకు నీ కుటుంబానికి నీ చెల్లెకు ఉన్న తగాదాలే నీకు సరిపోతలేవు నీ చెల్లె మీడియా ముందుకు వచ్చి స్పష్టంగా చెప్పింది మీరంతా ఒక దయ్యాలని మా నాన్నను తప్పుదోవ పట్టించేదే మీరు అని చెప్పకనే చెప్పింది కదా నీ చెల్లె...ఇంకా సిగ్గు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వాటాల కోసం కొట్టుకుంటున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నావ్ తస్మాత్ జాగ్రత్త ఖబడ్దార్ కేటీఆర్.. మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి 20 నెలలుగా పారదర్శకంగా పథకాలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నాం మీలాగా స్కీములు స్కామ్ లు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదని కేటీఆర్ మీ పదేళ్ల పాలనలో మీరు అవినీతి చేయలేదని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి సాక్షిగా ప్రమాణానికి నవ్వు సిద్ధమా మీరు అవినీతి చేశారని ప్రమాణం చేయడానికి మేము సిద్ధం.పింక్ మీడియాతో రకరకాల యూట్యూబ్ ఛానల్ పెట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నావ్ ఖబర్దార్ బిడ్డ కేటీఆర్ ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా పాలన కొనసాగుతుందని ఇప్పటికైనా సిగ్గు,శరం తెచ్చుకొని ఇలాంటి ఊకదంపుడు మాటలు మానుకోవాలి ఎమ్మెల్యే నాగరాజు హెచ్చరించారు. ఈ టిపిసిసి మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి, హన్మకొండ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, అడ్వకేట్ విష్ణు పాల్గొన్నారు.

# 2026 ఖరీఫ్ నాటికి సాగు నీరు అందేలా సీతారామ పాలేరు కెనాల్ పనులు పూర్తి చేయాలి

- ❖ ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ❖ పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- ❖ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ పాలేరు లింకు కెనాల్ టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



పాలేరు ఆర్సీ, 23అక్టోబర్ (తరంగాలు) : 2026 ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీరు అందించే విధంగా ప్రణాళికతో సీతారామ పాలేరు కెనాల్ టన్నెల్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, దమ్మాయిగూడెం లలో జరుగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ లోని పాలేరు లింకు కెనాల్ టన్నెల్ పనులను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి 2026 ఖరీఫ్ నాటికి గోదావరి, మున్నేరు జలాలను మన ప్రాంత రైతులు వినియోగించుకునే విధంగా చేపట్టిన ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ పనులు వేగవంతంగా అయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 8.2 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పనులకు గాను ప్రతిరోజు 24 మీటర్ల మేర పనులు చేపట్టి ఇప్పటి వరకు నాలుగు కిలోమీటర్ల పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన టన్నెల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా పోచారం వద్ద పెండింగ్ ఉన్న భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఇ యం. వెంకటేశ్వర్లు, డిఇ రమేష్ రెడ్డి, తిరుమలాయపాలెం మండల తహసీల్దారు లూథర్ విల్సన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు జీవ భౌతిక రసాయనిక పద్ధతులు పై అవగాహన సదస్సు



సంగెం అక్టోబర్ 23 తరంగాలు : మండల కేంద్రంలో రైతు వేదికలో ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో లోకల్ స్టేక్ హోల్డర్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ముందుగా ఐపీయం పద్ధతులకు సంబంధించింది ఒక ముగ్గు డయాగ్రమ్ వేసి రైతులకు సాంప్రదాయ జీవ భౌతిక రసాయనిక పద్ధతుల గురించి చెప్పడం జరిగింది ఆ తర్వాత ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజ్వల్ సంస్థ వ్యవసాయంలో రైతులతో పాటు ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, స్థానికంగా ఉన్న వివిధ సంస్థల తో అనుసంధానం చేసుకొని వ్యవసాయ కార్య కలాపాలు చేసుకుంటూ రైతులకు కూలీలకు సహాయపడుతున్నారని చెప్పి వ్యవసాయంలో రసానిక ఎరువులు పురుగు మందులు తగ్గించుకోవాలని చెప్పడం జరిగింది. సంగెం మండల వ్యవసాయ అధికారిజగదీష్ మాట్లాడుతూ ప్రజ్వల్ సంస్థ రైతులకు అందిస్తున్న సేవలు గురించి చెప్పుతూ రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తూ ఉత్తమ దిగుబడులు సాధించుకోవచ్చు అన్నారు. మాజీ ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి మాట్లాడుతూ పత్తి నాణ్యత పెంచాలంటే పత్తి తీసే క్రమంలో జాగ్రత్తలు పాటిస్తూ కాటన్ క్లాత్ బ్యాగ్స్ వాడుకుంటూ తేమ లేకుండా ఆరబెట్టుకొలి సూచించారు. కార్యక్రమంలో రైతులు మహిళలు తదితరులు.

# 30న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి..

**- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రా శ్రీనివాస్**




పాలేరు ఆర్సీ,23 అక్టోబర్ ( తరంగాలు) : వ్యవసాయ కార్మిక సంఘం కూసుమంచి మండలం కమిటీ సమావేశం పద్మారెడ్డి భవన్లో గురువారం జరిగింది. ఈ సమావేశం తోటకూర రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ 30న జరిగే తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంక్షేమ పథకాల హామీ కొరకై జరిగే ఈ ధర్నాకూ మండల వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికులు హాజరుకావాలని, అలాగే ప్రభుత్వం కూడా పింఛన్లను రూ.2000 నుండి 4000 వరకు పెంచి అమలు చేయాలని, వికలాంగులకు నాలుగు వేల నుండి 6 వేల వరకు వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇవ్వాలని, మహిళా పథకం కింద 2500 రూపాయలు, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన వారందరికీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి మామిడాల ఉపేందర్, సాగర్ కాశిమల్ల సాగర్, కందుల బాబు, వడ్త్యా రూప్లనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ను సందర్శించడం సంతోషంగా ఉంది

## - ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్, పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా

వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 23,తరంగాలు : వరంగల్ ను సందర్శించడం సంతోషంగా ఉందని ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్ , పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా అన్నారు. వరంగల్ లోని కాకతీయుల కళా సంపదను వీక్షించడానికి విచ్చేసిన ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్ దంపతులు , పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా దంపతులు హన్మకొండ, నక్కలగుట్ట లోని హరిత కాకతీయ హెూటల్ కు విచ్చేసినారు. ఈ సందర్భంగా గురువారం ఎన్పీడీసియల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి , వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ , హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ , వరంగల్ కలెక్టర్ సత్య శారదా, జీడబ్ల్యుయంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయి పుష్ప గుచ్చము తో ఆహ్వానం పలికారు. మొదటగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్లు హన్మకొండలోని వేయి స్తంభాల గుడిని సందర్శించారు. పూజారులు మహా రుద్రాభిషేకం రుద్రేశ్వర స్వామివారికి జరిపించి , వేద పండితులచే ఆశీర్వచనం జరిపించారు. కాకతీయుల కళ చతురతను చూసి అబ్బురపడ్డారు. చైర్మన్లు ఇరువురు మాట్లాడుతూ కాకతీయుల సామ్రాజ కళాపిపాసాకు, శిల్పుల పనితనానికి మచ్చుతున కగా భావితరాలకు నిలుస్తుందని పేర్కొన్నారు. ఇంతటి ప్రసిద్ధి గల కాకతీయుల వంశానికి చెందిన వేయి స్తంభాల గుడిని దర్శించు కోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. అనంతరం భద్రకాళి భవాని మాత ఆలయాన్ని దర్శించుకున్నారు. భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు పూర్ణకుంభ తో స్వాగతం పలికారు. భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు ఆశీర్వచనం జరిపించారు. తదనంతరం వరంగల్ లోని ప్రసిద్ధి చెందిన ఓరుగల్లు కోటలో ఉన్న కాకతీయ కీర్తితోరణాలు, ఏకశిల గుట్ట, గుండుచె రువు, ఖుష్ మహల్ ను సందర్శించారు. స్వయంభూ శివాలయంలో పంచామృతం తో అభిషేకాలు నిర్వహించారు. అక్కడ ఉన్న గైడ్ సూర్య కిరణ్ వివరిస్తూ చరిత్ర ప్రకారం ఈ కోటకు మూడు ప్రాకారాలు ఉన్నాయని, ఆ ప్రాకారాల అవశేషాలు ఇప్పటికి కూడా చూడవచ్చని, మొదటి ప్రాకారం మట్టితో చేసినది దీనిని ధరణి కోట అని పిలుస్తారని వివరించారు . ఇది 20 అడుగుల ఎత్తు ఉంటుందని, రెండవ ప్రాకారములో ఉన్నది రాతి కోట గ్రానైటు రాళ్ళతో నిర్మితమైనదని గైడ్ చెప్పారు . రాతి కోటకు పెద్ద పెద్ద ఏకశిలా రాతి ద్వారాలు ఉన్నాయని, ఈ ద్వారాల ఎత్తు 30 అడుగులు ఉండి ఏకశిల నిర్మితమైనవి అని తెలిపారు. కోట ద్వారం మీద కీర్తి తోరణాలు ఉన్నాయని (పూర్ణ కుంభం వంటివి). ఈ కీర్తి తోరణాలు ఇప్పటి తెలంగాణ రాష్ట్ర ఆధికారిక చిహ్నంగా ఉన్నాయని చెప్పారు. తదనంతరం చైర్మన్లు ఇరువురు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర గల వరంగల్ ను సందర్శించడం సంతోషంగా ఉందని , కాకతీయులు నిర్మించిన స్మారక కట్టడాల్లో కోటలు, సం-స్సులు, దేవాలయాలు, రాతి ద్వారాలు పర్యాటక ఆకర్షణగా ఉన్నాయని అన్నారు .ఎన్పీడీసియల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి,వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జీడబ్ల్యుయంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయి శాలువ, మెమెుంటోతో ఇరువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మోహన్ రావు, మధు-సూదన్, సి. ప్రభాకర్ హన్మకొండ ఎస్ఈ పి .మధుసూదన్ రావు, వరంగల్ ఎస్ఈ కె. గౌతమ్ రెడ్డి, డి .ఈ లు సాంబరెడ్డి , మల్లికార్జున్, భాస్కర్ ఏ.డి.ఈ పి.మల్లికార్జున్ పాల్గొన్నారు.







# కంచ ఐలయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించిన విజయ సారథి



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్. 23, తరంగాలు : కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ సిపిఐ సీనియర్ నాయకుడు కంచ ఐలయ్య అనారోగ్యంతో మృతిచెందగా గురువారం ఎర్రజెండా కప్పి పూలదండ వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి, కేసముద్రం మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, వీరబోయిన చంద్రయ్య, ఎర్రోజు కరుణాకర్, రాజబోయిన చంద్రయ్య, చాగంటి వెంకన్న, గుండాల నర్సయ్య, ఆవుల బాబు, సోమ సుధాకర్ తదితరులు ఉన్నారు.

# 29న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

## - నేలకొండపల్లిఎస్సై సంతోష్

పాలేరు ఆర్సీ, 23అక్టోబర్ (తరంగాలు): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో సందర్భంగా ఈనెల 29న నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి ఎస్సై సంతోష్ కోరారు. రోడ్డు ప్రమాద బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, డెంగ్యూ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల సమయానికి బ్లడ్ బ్యాంకులో రక్త నిలువలు లేక పోవడం వల్ల మరణాలకు గురవుతున్నారని, అలాంటి వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, ఈ రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని సూచించారు. ఈ రక్తదాన శిబిరానికి మండల ప్రజలు, యువతీ,యువకులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# మహాసభలను విజయవంతం చేయాలి

## - పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ముక రవి



నర్సంపేట, అక్టోబర్ 23, తరంగాలు విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు ఆధ్వర్యంలో ఈనెల 28 29 30వ తేదీలలో వనపర్తి జిల్లా కేంద్రంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి పిలుపునిచ్చారు ఈ మేరకు పట్టణంలోని భద్రకాళి ఒకేషనల్ కళాశాలలో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 1972లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అరాచకాలకు ర్యాగింగ్ మరియు కుల వివక్షతకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన ఉస్మానియా ఆసుపత్రిలో అరుణతార జార్జిరెడ్డి తన మిత్ర బృందంతో ఏర్పడిన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాదిమంది పేద విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు శాస్త్రీయ విద్యాసాధనకై సమసమాజ స్థాపనకై కదులుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ అనేకమంది విద్యార్థులు తమ ప్రాణాలను ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం కోసం త్యాగం చేశారన్నారు వారి త్యాగాలతో ఎరుపెక్కిన బిగిపిడికిలి జెండా నేటికీ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తూనే ఉందన్నారు ఈ క్రమంలోనే గత ఉద్యమాల సమీక్షకై నూతన కర్తవ్యాలకై రాష్ట్ర మహాసభలను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగానికి మంత్రిని కేటాయించే పరిస్థితి కనబడటం లేదని రాష్ట్రంలోని విద్యార్థులకు అందాల్సిన స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ నేటికీ నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్లోనే ఉందన్నారు గురుకులాలలో విష ఆహారం తిని మరణాల పాలవుతున్నారని సంక్షేమ హాస్టల్స్ ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయంగా మారాయి అన్నారు సమస్య ఉత్పన్నమైనప్పుడు మాత్రమే అధికారులు విద్యాలయాలను తూతూ మంత్రంగా పర్యవేక్షించడం తప్ప పరిష్కరించిన పాపాన పోలేదన్నారు నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూలు అనే ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దాన్ని హామీకే పరిమితం చేసిందని మహాసభలకు జిల్లా విద్యార్థులు మేధావులు కార్మికులు, కర్షకులు అన్ని వర్గాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేసి విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రేవంత్ ప్రశాంత్ రాకేష్ రమేష్ సందీప్ రజిత రాధిక రాజా తో పాటు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన

## ఇంచార్జ్ ఎమ్మెల్యే నాగరాజు, అమిత్ రెడ్డి, వెంకటరామిరెడ్డి

జూబ్లీహిల్స్, అక్టోబర్ 23, తరంగాలు : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని శంకర్ లాలా నగర్ బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక ఇంచార్జ్,వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, తెలంగాణ విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి ప్రారంభించి మొదటి రోజులో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్తీ ప్రజలతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎర్రగడ్డ ప్రాంతంలో రూ. 3 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశాము. మొత్తంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ. 150 కోట్లతో వివిధ రహదారులు,డ్రైనేజీ, విద్యుత్ మరియు నీటి సరఫరా వంటి ప్రజావసర సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రజల అభివృద్ధి కోసం రాత్రింబవళు శ్రమిస్తున్న యువ నాయకుడు నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించి, కాంగ్రెస్ పార్టీకి బలాన్నివ్వండి. చేతి గుర్తుపై ఓటు వేసి అభివృద్ధికి మద్దతివ్వండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.







# ఘనంగా కొండా పుట్టినరోజు వేడుకలు

వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 23,తరంగాలు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, ప్రియతమ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ జిల్లా నాయకులు పోలేపల్లి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐనవోలులోని కనుకదుర్గ వృద్ధ ఆశ్రమం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా అభిమాన నాయకుడు కొండ మురళీధర్ రావు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండి పేదలకు ఎప్పుడు సేవ చేసేలా భగవంతుడు శక్తి నివ్వాలని ప్రార్థించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్



గౌడ్,కొండా వీరాభిమాని బరిగెల శివ తదితరులు పాల్గొన్నారు..

# పాస్ పుస్తకాలు ఇవ్వాలని వేం నరేందర్ రెడ్డికి వినతి

కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు ఎంజాయ్ మెంట్ సర్వే ప్రకారంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించి తమకు న్యాయం చేయాలంటూ సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి కి గురువారం హైదరాబాదులో ఎంపీ బలరాం నాయక్ ఆధ్వర్యంలో సీఎం సలహాదారుడిని స్వయంగా కలిసి మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి నాయక్ తోపాటు మరికొందరు రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ జిల్లా కలెక్టర్ కి ఫోన్ ద్వారా నారాయణపురం గ్రామ రైతులకు వారం రోజులలో పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని వారంలో రెవెన్యూ మంత్రి గారి ప్రోగ్రాం ఉ ంటుందని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో జాటోత్ వెంకన్న , ధరావత్ శ్రీనివాస్ ,గుగులోత్ లక్పతి, గుగులోత్ శంకర్, ధరావత్ రమేష్, గుగులోతు లచ్చు, విరాసింగ్, భాష , సురేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలను ఎండగట్టాలి

## - టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి

పాలకుర్తి ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : అసత్య ప్రచారాలను ఎండగట్టాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి, స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ అన్నారు. గురువారం దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సోషల్ మీడియా సమీక్ష సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్,టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్ని రాయపర్తి మండల




సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు,దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఝాన్సీ రాజేందర్ రెడ్డికి సోషల్ మీడియా కోఆర్డినేటర్లు శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఝాన్సీ రెడ్డి ప్రభుత్వ పథకాల పై ప్రజల్లో వస్తున్న స్పందన మరియు పార్టీ బలోపేతం స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అనుసరించవలసిన వ్యూహాల పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లో వివరించి, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- **కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యువజన నాయకులు పనిచేయాలి**
- **యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



పాలకుర్తి ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యువజన నాయకులు పనిచేయాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం పాలకుర్తి మండల కేంద్రంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాలకుర్తి మరియు కొడకండ్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ కార్యకలాపాల పురోగతిపై సమీక్ష జరిపి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత మరింత చు- రుకుగా వ్యవహరించా లని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన నాయకులు అహర్నిశలు కృషి చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ యువతే కాంగ్రెస్ పార్టీకి పునాది. రాబోయే ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలతో మమేకమై, పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి. ప్రతి గ్రామంలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్ జెండా ఎగరేలా పని చేయాలి అని తెలిపారు. అలాగే సోషల్ మీడియా వేదికల ద్వారా యువత కాంగ్రెస్ పథకాలు, పార్టీ ఆలోచనలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. క్రమశిక్షణ, సేవా భావం, సమన్వయంతో పనిచేస్తే పార్టీ బలోపేతం అవుతుందని, య- ువజన కాంగ్రెస్ భవిష్యత్తు నాయకత్వానికి పునాది వేయాలని వారు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, దరవత్ సురేష్ నాయక్, పాలకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హరీష్, కొడకండ్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యకేష్, యువజన గ్రామ అధ్యక్షులు, పాల్గొన్నారు..

# ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి క్షేమంగా గమ్యాన్ని చేరండి

## - డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి



నర్సంపేట, అక్టోబర్ 23, తరంగాలు : ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి ప్రజలు తమ గమ్యాలకు క్షేమంగా చేరవచ్చని నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి అన్నారు. గురువారం నర్సంపేట బస్టాండులో ప్రతి బస్సులోని కండక్టర్ డ్రైవర్ మరియు ప్రయాణికులకు స్వాగతం పలుకుతూ ధన్యవాదాలు తెలిపి పరిచయం చేసుకుంటూ వారి విధులు నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు బస్సులో ప్రయాణికులు అందరూ బస్సు ఎక్కిన తర్వాత కండక్టర్ డ్రైవర్ ప్రయాణికులం ముందుకు వెళ్లి నమస్కారములు నా పేరు సోమ మాధవ్ నేను ఈ బస్సు కండక్టర్ ను టీజీ ఎస్ ఆర్ టి సి డిపో మా డ్రైవర్ పేరు వేణు ఈ బస్సు నర్సంపేట నుంచి హనుమకొండ కి వెళ్తుంది ఈ బస్సు వెళ్లడానికి దాదాపు గంట పది నిమిషాలు పడుతుంది మిమ్మల్ని మీ గమ్యస్థానాలకు చేర్చవలసిన బాధ్యత మాది ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం సుఖవంతం శుభప్రదం అని అన్నారు మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణించినందుకు ధన్యవాదాలు అని తెలిపారు.

# గ్రామకంఠం భూమిపై కోర్టు తీర్పును పాటించాలి

## - పర్వతగిరి ఎస్సై ప్రవీణ్ కుమార్

పర్వతగిరి, తరంగాలు (అక్టోబర్ 23): మండలంలోని దౌలత్ నగర్ గ్రామంలో గల గ్రామకంఠం భూమికి సంబంధించిన మూడు ఎకరాల ఏడు గంటల స్థలం చట్టపరంగా పర్వతగిరి గ్రామానికి చెందిన చిదురాల వేణు గోపాల్ కుటుంబ సభ్యులకు చెందుతుందని కోర్టు ఇచ్చిన తీర్పు అనుసరించి, సర్వహక్కులు వారికే ఉంటాయని పర్వతగిరి ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూమిలో లబ్ధిదారులు చెత్తా చెదారం,ముళ్ళ చెట్లను చదును చేస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన పలువురు అడ్డుకున్నందున, సంబంధిత లబ్ధిదారులు 100 కు డయల్ చేయడం ద్వారా పోలీసులను ఆశ్రయించగా, గ్రామకంఠం భూమికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లను పరిశీలించిన స్థానిక ఎస్సై బి. ప్రవీణ్ కుమార్ ఇరువురిని పోలీస్ స్టేషన్ కు రప్పించి స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సదరు వేణుగోపాల్ వద్ద నుండి కల్లెడ గ్రామానికి చెందిన సంపెల్లి వెంకటేశ్వరరావు భూమిని కొనుగోలు చేయడం జరిగిందనీ, వెంకటేశ్వరరావు వద్ద నుండి కొనుగోలు చేసిన సుమారు 50 మంది కొనుగోలుదారులకు కూడా అవే హక్కులు సంక్రమిస్తాయని, కొనుగోలుదారులు చేస్తున్న పనులను అడ్డుకున్న అధికార పార్టీ కార్యకర్తలకు పర్వతగిరి ఎస్సై ప్రవీణ్ కుమార్ కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా సర్వహక్కులు కలిగి ఉన్న వారిని ఇబ్బందులు కు గురి చేయకూడదని, జిల్లా కోర్టు తీర్పు పై కోర్టులకు వెళ్ళవచ్చునని,అంతేకానీ కొనుగోలుదారులకు ఇబ్బందులు కలిగిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. కొనుగోలుదారులైన ప్లాట్ల యజమానులు వారికి కలుగుతున్న ఇబ్బందిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఈ కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని అన్నారు.

# రైతులను మోసం చేసిన సీడ్ కంపెనీ



పర్వతగిరి, తరంగాలు (అక్టోబర్ 23): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కేంద్రంలో మహింద్ర సీడ్ పేరుతో రైతులను నట్టేట ముంచారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 200 మంది రైతులకు మహింద్ర కంపెనీ వారు సీడ్ పేరుతో విత్తనాలను విక్రయించారని, పండించిన వరి పంటను ఆ సీడ్ వారే కొనుగోలు చేశారని, కొనుగోలు చేసిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా ఏడు నెలలుగా 200 మంది రైతులకు సంబంధించి రూ. 1.30 కోట్లకు గాను, రూ.60 లక్షల వరకు చెల్లించారని, మిగతా రూ.70 లక్షలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గతంలో ఒకసారి వచ్చి రైతులకు సమయం పెట్టి,ఆ సమయానికి కూడా డబ్బులు ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. దళిత మహిళా రైతు తమ డబ్బులు అడగగా, కులం పేరు పెట్టి దూషించారని సదరు మహిళా రైతు ఆరోపణ చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు స్థానిక రైతు రావుల రాజు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు పెద్ద మనసుతో స్పందించి, సంబంధిత కంపెనీ తో మాట్లాడి తమకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలని నష్టపోయిన రైతులు వేడుకుంటున్నారు.

# పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్షా సమావేశం



బంజారాహిల్స్, అక్టోబర్ 23,తరంగాలు : పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించేందుకు నియోజకవర్గ పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో నియోజకవర్గంలోని రహదారి నిర్మాణాలు, సౌకర్యాలు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, డ్రైనేజ్ వ్యవస్థలు మరియు పంచాయతీ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై విపులంగా చర్చించారు.ఎమ్మెల్యే అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలి. ఏ పనీ అర్థాంతరంగా ఉండకూడదు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులపై సమీక్ష చేసి, అవసరమైన నిధుల విడుదలకు సంబంధించిన వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి మరమ్మతులు, బావుల పునరుద్ధరణ, పంచాయతీ భవనాల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు.సమీక్షా సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఈఈ, డి ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పట్ల చూపుతున్న చొరవ, ప్రతి ప్రాజెక్టును దగ్గరుండి పర్యవేక్షిస్తున్న తీరు అధికారులను, ప్రజలను ఆకట్టుకుంటోంది.

# గొల్లపల్లి కుమారస్వామి గౌడ్ మరణం బాధాకరం

### - నివాళులర్పించిన రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి



నర్మెట, అక్టోబర్ 23, తరంగాలు : వార్డ్ మెంబర్ గా, మూడు సార్లు సర్పంచ్ గా, సహకార బ్యాంక్ డైరెక్టర్ గా, కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గా సేవలందించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి కుమారస్వామి గౌడ్ మరణం బాధాకరం అని రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి అన్నారు. గురువారం గొల్లపల్లి కుమారస్వామి గౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి మృతుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్మెట మండలం ఒక పెద్ద దిక్కును కోల్పోయింది అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కు సైబర్ క్రైమ్ పై అవగాహన



పర్వతగిరి, అక్టోబర్ 23, తరంగాలు : పోలీసు అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీఐ రాజగోపాల్ మరియు ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్ లో ఉన్నత పాఠశాల మరియు ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయనీ,పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, ఏదైనా సైబర్ ఫ్రాడ్ జరిగితే వెంటనే 1930కి సమాచారం అందిస్తే వెంటనే అప్రమత్తంతో రికవరీ చేయడానికి సులభం అవుతుందని, విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకొని, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విశృంకల పాశవికమైన ఆలోచనా విధానాల వలన మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు చోటు చేసుకుంటున్నాయని, వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల ఆలోచనలో మార్పు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ లు రమేష్, మురళి, అనన్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# పుస్కోస్ పాఠశాలపై చర్యలేవి..?

- ❖ నిజమని నిర్ధారణ అయినా నిర్లక్ష్యం ఎందుకు...?
- ❖ ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులకు అంత ప్రేమ ఎందుకు...?
- ❖ ఆ విద్యా సంస్థపై చర్యలు తీసుకోకుంటే మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం
- ❖ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి



వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 23, తరంగాలు : వర్ధన్నపేట పట్టణంలోని పుస్కోస్ పాఠశాల విద్యార్థులకు మత బోధనలు చేస్తూ దొరికిపోయిన తర్వాత మండల విద్యాశాఖ అధికారులు ఎంక్వయిరీ చేసి అది నిజమని తేల్చిన తర్వాత కూడా ఇప్పటివరకు జిల్లా అధికారులు, పోలీసు శాఖ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం,చట్టం ఎటువైపు పోతుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ,అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లిన తర్వాత కూడా విద్యాశాఖ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకుండా ఎటువంటి చర్యలు తీసుకోకుండా వారిపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మహేందర్ రెడ్డి ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు మరియు ప్రాంతీయ విద్యాశాఖ అధికారికి వివరాలు తెలిపిన తర్వాత కూడా ఇప్పటివరకు వారు ఆ పాఠశాలను సందర్శించి ఆ పాఠశాలపై చర్యలు తీసుకునే విధంగా ఏ ఒక్క పని చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడం దేనికి నిదర్శనం అని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోని సరియైన చర్యలు ఆ విద్యా సంస్థపై తీసుకోకుంటే మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని,మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జడ సతీష్ మాట్లాడుతూ మత బోధనలు చేస్తున్న పాఠశాలపై ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే హిందూ సంస్థలు మరియు భారతీయ జనతా పార్టీ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు పంజా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల పై సత్వరమే చర్య తీసుకోవాలని లేదంటే భారతీయ జనతా పార్టీ ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టదని అధికారులను హెచ్చరించారు.

# పాఠశాలకు రూ.50 వేల కంప్యూటర్లు బహుకరణ

### - మనబడి పిలుస్తుంది శీర్షికకు స్పందించిన నంచర్ల మురళి -సరోజన దంపతులు

వర్ధన్నపేట, అక్టోబర్ 23,తరంగాలు మనబడి పిలుస్తుంది శీర్షికకు స్పందించిన నంచర్ల మురళి - సరోజన దంపతులు ల్యాబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50వేల విలువచేసే కంప్యూటర్లు బహుకరించారు. వర్ధన్నపేట మండలం జిల్లా పరిషత్ ల్యాబర్తి ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు నంచర్ల మురళీ - సరోజన దంపతులు పాఠశాలను సందర్శించి పాఠశాల ఉపాధ్యాయుల మనబడి పిలుస్తుంది శీర్షికతో చేస్తున్న పనితీరును ప్రశంసిస్తూ పాఠశాల అభివృద్ధిలో భాగంగా పాఠశాలకు రెండు (2) కంప్యూటర్లను బహుకరించారు . వీరు ఈనెల 03-10-2025 పాఠశాలను సందర్శించి కంప్యూటర్లు ఇస్తామన్న విషయము విధితమే. వీరు మాట్లాడుతూ పాఠశాలలో ఇంతకుముందు ఉన్న కంప్యూటర్ల రిపేర్ కు సంబంధించిన ఖర్చులకు సహకరిస్తానని పేర్కొంటూ భవిష్యత్తులో విద్యార్థులకు కంప్యూటర్లు మరియు ఎఐ పరిజ్ఞానము చాలా ముఖ్యమని ఇకముందు ప్రభుత్వ పరీక్షలన్నీ ఆన్లైన్ విధానంలోనే ఉంటాయని, పాఠశాలకు ఎటువంటి మౌలిక సౌకర్యాల విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయి విద్య చదివి గ్రామానికి, పాఠశాల అభివృద్ధిలో తోడ్పడాలని సూచించారు. ల్యాబర్తి పాఠశాలలో కంప్యూటర్ విద్యపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ గూర్చి ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసించారు. వీరితోపాటు గ్రామ నాయకులు మారేపల్లి ఎల్లయ్య , బత్తిని సురేష్ ఉన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగం శైలజ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





# పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్
- జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్



తరంగాలు / మెదక్, అక్టోబర్ 23 : పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, ఆయుధాల వినియోగ పద్ధతులు వంటి అంశాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శనలో ఏకే-47, ఎస్ఎల్ఆర్ కార్బైన్, 9ఎంఎం పిస్టల్, ఎల్ఎమ్జీ 303 రైఫిల్, గ్లాక్ పిస్టల్, గ్రెనేడ్ లాంచర్, అలాగే బీడీ టీమ్ డాగ్ స్క్వాడ్ తదితర విభాగాల స్టాళ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అందులో బాగంగా అక్టోబర్ 21 నుండి 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఆర్.ఐ. శైలేందర్, ఆర్.ఎస్.ఐ.లు నరేష్, సుభాష్, భవాని కుమార్, పోలీస్ సిబ్బంది, మెదక్ పట్టణంలోని గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినీలు, గీతా స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com